సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నమ్మిదొడ్డిలో ఉచిత వైద్య శిబిరం నేడు

పెదగంట్యాడ: వికసిత భారత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా 77వ వార్డు దేవాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని నమ్మిదొడ్డి జంక్షన్‌లో బుధవారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, దేవాడ పీహెచ్‌సీ వైద్యాధికారి ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నారు. అంతేకాకుండా కేంద్ర ప్రభుత్వ పథకమైన ప్రధాన మంత్రి మాతృ వందన యోజన (పీఎంఎంవీవై) కింద లబ్ధిదారులు అయిన మొదటి కాన్పు గర్భవతులు, రెండో కాన్పులో ఆడ బిడ్డకు జన్మనిచ్చిన వారిని బీపీఎల్ కింద గుర్తించనున్నారు. అలాగే క్షయ నిర్ధారణ, కుష్టు వ్యాధి పరీక్షలు చేయనున్నారు. బీపీ, షుగర్ రోగులకు ఉచితంగా మందులు అందజేయనున్నారు.

24న ఆత్మీయ సమావేశం



సమావేశంలో మాట్లాడుతున్న చెల్లిబోయిన నాయుడు

పెదగంట్యాడ: యాత, శెట్టిబలిజ, గౌడ, ఈడిగ సంక్షేమ సంఘం, గీత ఉప కులాల ఆత్మీయ సమ్మేళనాన్ని ఈ నెల 24న నిర్వహించనున్నామని ఆ సంఘం నాయకుడు చెల్లిబోయిన నాయుడు తెలిపారు. స్థానిక సమతానగర్‌లో సంఘం యూత్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉక్కునగరంలోని నెహ్రూపార్కులో నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి పారిశ్రామిక ప్రాంతంలోని గీత ఉప కులాల కుటుంబాలతో హాజరు కావాలని కోరారు. సమావేశంలో పితాని భాస్కరరావు, మంగరాజు, రమణబాబు, అప్పారావు, శ్రీను, జగదీష్, కండిపిల్లి సత్యనారాయణ పాల్గొన్నారు.

మెగా రక్తదాన శిబిరం రేపు



రక్తదాన శిబిరం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చందు తదితరులు

గాజువాక: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జన్మదినం సందర్భంగా ఈ నెల 21న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరాన్ని జయప్రదం చేయాలని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు (చందు) కోరారు. శిబిరం పోస్టర్‌ను ఆయన మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమ్మ బ్లడ్‌బ్యాంక్ సహకారంతో ఈ కార్యక్రమం పంతులుగారి మేడ సమీపంలోని శ్రీనివాస కల్యాణ మండపంలో ఉదయం ఏడు గంటలకు ప్రారంభమవుతుందన్నారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ రూ.2.5 లక్షల ప్రమాద బీమాను ఇవ్వనున్నట్టు తెలిపారు. నియోజకవర్గంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ శిబిరాన్ని జయప్రదం చేయాలని కోరారు.

విద్యుత్ పొదుపుపై వక్తృత్వ పోటీలు



వక్తృత్వ పోటీల్లో మాట్లాడుతున్న విద్యార్థులు

గాజువాక: విద్యుత్ పొదుపు వారోత్సవాల్లో భాగంగా ఏపీఈపీడీసీఎల్ విశాఖ సబ్ డివిజన్ అధికారులు స్థానిక శ్రీకృష్ణా జూనియర్ కళాశాల విద్యార్థులకు మంగళవారం వక్తృత్వ పోటీలను నిర్వహించారు. గాజువాక డీఈఈ సీహెచ్.మీనకేతనరావు ప్రారంభించిన ఈ పోటీల్లో 60 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆటోనగర్ డీఈఈ ఎ.పార్థసారథి, కళాశాల కరస్పాండెంట్ టి.ఉమామహేశ్వరరావు, చినగంట్యాడ సబ్‌స్టేషన్ సహాయ ఇంజినీర్ ఆర్.వి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నాడు పశువులకు నుస్తీ చేస్తే వాటిని ఆస్పత్రికి తీసుకు వెళ్లాలంటే ఎంతో కష్టమయ్యేది. పైగా ఆర్థికంగానూ ఎంతో భారం. అనారోగ్యంతో ఉన్న వాటిని వేరే వాహనం మీద తీసుకువెళ్లడం అంటే ఎంతో ఖర్చుతో కూడుకున్నది కావడంతో పాడిరైతులు ఇబ్బంది పడేవారు.

నేడు మూగ జీవాల బాధకు, పాడి రైతుల ఆర్థిక వెతలకు చెక్ పెడుతూ అందుబాటులోకి వచ్చేసింది అపర సంజీవని వంటి సంచార పశువైద్యశాల 1962. ఒక్క ఫోన్‌కాల్ చేస్తే చాలు.. వైద్యులు, మందులతో సహా కొద్ది సేపటికే అక్కడికి చేరుకుంటుంది వాహనం. తక్షణ వైద్యసహాయం అందించడంతో అవి సత్వరం కోలుకుంటున్నాయి. దీంతో పశువుల పెంపకందార్లలో హర్షం వ్యక్తం అవుతోంది.

మూగ జీవాల ఆరోగ్య నేస్తం



- 108 మాదిరిగా 1962
- పశువుల చెంతకే వైద్యం
- అత్యవసర చికిత్సపై స్పెషల్ ఫోకస్
- రెండు వాహనాల ద్వారా సేవలు
- పశు సంరక్షణ కార్డులు
- పాడి రైతుల హర్షం

పెదగంట్యాడ: మూగజీవాల ప్రాణరక్షణ కోసం ఏర్పాటు చేసిన 1962 వాహనాలు ప్రస్తుతం గ్రామాల్లో ఆరోగ్య నేస్తంగా మారిపోయాయి. ఎక్కడైనా, ఏదైనా ప్రమాదం జరిగిన వెంటనే 108 వాహనం హుటాహుటిన అక్కడికి చేరుకుని క్షతగాత్రులకు తక్షణ సాయం అందిస్తున్న మాదిరిగానే పశువుల కోసం 1962 అనే టోల్ ఫ్రీ నెంబర్‌ను అందుబాటులో ఉంచారు. ఆ నంబర్‌కు ఫోన్ వచ్చిన వెంటనే వైద్యులు అప్రమత్తమై, అక్కడకు చేరుకుని అనారోగ్యంతో ఉన్న పశువులను పరీక్షించి వాటికి తగిన వైద్యం అందజేస్తున్నారు. పాము కాటు, కుక్క కాటుకు గురైన పశువులకు సత్వర వైద్యం అందజేసి, వాటిని ప్రాణాపాయ స్థితి నుంచి రక్షిస్తున్నారు. వాటికి అవసరమైన మందులు, వ్యాక్సినేషన్‌ను భద్రపరిచేందుకు వాహనంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వ్యాక్సిన్ స్టోరేజ్ కోసం ప్రత్యేకంగా ఫ్రీజర్ బాక్సులు అమర్చారు.

అందుబాటులో రెండు వాహనాలు

గాజువాక నియోజకవర్గ పరిధిలోని రెండు మండలాలు గాజువాక, పెదగంట్యాడకు సంబంధించి రెండు వాహనాలను అందుబాటులో ఉంచారు. పశువైద్య శాలలతో పాటు సంచార వాహనాలతో నిత్యం సేవలందిస్తున్నారు. ఈ వాహనంలో ఒక డ్రైవర్, వైద్యుడు, సహాయకుడు ఈ సేవల్లో పాలు పంచుకుంటున్నారు.



ఆవు పెయ్యికి వైద్యం చేస్తున్న వైద్యాధికారి



చికిత్స కోసం ఆవును తీసుకువస్తున్న మహిళ

పశువులకూ హెల్త్ కార్డులు



పశువుల హెల్త్ కార్డు అందజేస్తున్న వైద్యాధికారి

పశువుల సంరక్షణకు వైద్యసిబ్బంది హెల్త్ కార్డులు అందజేస్తున్నారు. రైతులు, వారికి చెందిన పశువుల వివరాలను ఆన్‌లైన్ చేస్తున్నారు. పశువులకు ప్రతి నెలా క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయడం, వాటిని ఆయా కార్డుల్లో నమోదు చేయడం చేశారు. అనేకమందికి జీవనోపాధికి ఆధారంగా నిలిచే పాడి గేదెలు, మేకలు, గొర్రెల సంరక్షణ కోసం పటిష్టమైన చర్యలు చేపట్టారు.



మొబైల్ వాహనంలో ..

డాక్టర్	సహాయక సిబ్బంది	డ్రైవర్
1	1	1

పరికరాలు

- ఫ్రీజర్: మందులు, ఫస్ట్ ఎయిడ్ బాక్స్
- హైడ్రాలిక్ ట్రావిస్ (పశువుల తొట్టె)
- పశువుని పైకి లేపి, లోపల పెట్టేలా.. ల్యాబ్ రిక్వైర్‌మెంట్స్
- మైక్రో స్కోప్, ల్యాబ్ టెస్టింగ్ మెటీరియల్

సంచార పశు వైద్యశాలలు **2**

ఒక్కో వాహనం ధర రూ.**60** లక్షలు

ఇంటి వద్దే సేవలు



నేను ఆవులు, గేదెలను పెంచుతున్నాను. వాటి మీదే ఆధారపడి బతుకుతున్నాను. మా పశువులు అనారోగ్యం బారిన పడితే 1962కు కాల్ చేస్తున్నాను. వెంటనే వైద్యులు ఇంటికి వచ్చి సేవలందిస్తున్నారు. ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ఆడపెయ్యల ఉత్పత్తి పథకం మాకు ఒక వరం.

– సతీష్‌రెడ్డి, మొల్లివానిపాలెం, పెదగంట్యాడ

మూగజీవాల ప్రాణాలు కాపాడుతున్నారు



పాడి పశువులే మా కుటుంబానికి ఆధారం. మా పశువులకు ఏమైనా ఆరోగ్య సమస్యలు వస్తే వెంటనే పశువైద్యశాలకు వెళ్లేవాళ్లం.. సకాలంలో వైద్యం అందకపోవడంతో అవి మృత్యువాత పడేవి. కానీ ఇప్పుడు ఫోన్ చేసిన వెంటనే వైద్యులు వస్తున్నారు. మూగజీవాల ప్రాణాలను కాపాడుతున్నారు. – దుంప పెంటమ్మ, వియ్యపువానిపాలెం, పెదగంట్యాడ

విస్తృతంగా సేవలు



గతంలో పశువైద్యశాలలోనే ఉంటూ సేవలందించేవాళ్లం. ఇప్పుడు సంచార వైద్యశాల ద్వారా గ్రామాల్లోకి వెళ్తున్నాం. పశువులకు చికిత్స చేస్తున్నాం. పశువులకు సంబంధించిన వ్యాధులను నయం చేసేందుకు మందులు సిద్ధంగా ఉన్నాయి. గొర్రెలు, మేకలకు వచ్చే నీలినాలిక వ్యాధుల కోసం టీకాలు ఉన్నాయి. కుక్కలకు కూడా ఎప్పటికప్పుడు టీకాలు వేస్తున్నాం. ఆడపెయ్యల ఉత్పత్తి పథకాన్ని అమలు చేస్తున్నాం.

– డాక్టర్ విజయ్‌కుమార్ పాణిగ్రహి, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్, పెదగంట్యాడ

మాట తప్పని నేత సీఎం జగన్

- అందుకే ఆయన మళ్లీ రావాలని ప్రజల ఆకాంక్ష
- వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు



బాలచెరువు సచివాలయ పరిధిలో డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న చందు తదితరులు

కూర్మన్నపాలెం: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి, సుపరిపాలన ద్వారా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన మంచి వల్లే ప్రజలు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎం చేయాలని కోరుకుంటున్నారని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి రామచంద్రరావు(చందు) అన్నారు. ఎంత కష్టమైనా, నష్టమైనా మాట మీద ఉండే వ్యక్తిత్వం ఆయన సొంతమన్నారు. 88వ వార్డు కాపుజగ్గరాజుపేట సచివాలయ పరిధిలో మంగళవారం నిర్వహించిన 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం గత నాలుగున్నరేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో సచివాలయ పరిధిలో జరిగిన సంక్షేమం, అభివృద్ధిని సూచించే డిజిటల్ డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో వ్యవసాయ, పరిశ్రమ, విద్య, వైద్య రంగంలో అనేక మార్పులు తీసుకువచ్చి దేశంలోనే ఏపీని అగ్రస్థానంలో నిలబెట్టారన్నారు. కార్యక్రమంలో 88వ వార్డు ఇన్‌చార్జి మహాలక్ష్మినాయుడు, జేసీఎస్ కన్వీనర్ వాడపల్లి రామచంద్రరాజు, నమ్మి ప్రసాద్, ఉరుకూటి అప్పారావు, మాడిశ చిన్నారావు, మాడిశ రాజు, పమరు దుర్గారావు, పాత్రపల్లి గణేష్, మచ్చ మహేష్, సంద్రని నరసింహరాజు, సర్వసిద్ధి వరప్రసాద్, పమరు సత్తిరాజు, సీవో ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

73వ వార్డులో..



సంక్షేమ పథకాలు తెలిపే డిజిటల్ డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరిస్తున్న ఉరుకూటి చందు

గాజువాక: దేశంలోనే ఆదర్శవంతమైన పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త ఉరుకూటి చందు కోరారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమాన్ని బాలచెరువు సచివాలయం పరిధిలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందెన్నడూ లేని విధంగా జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని ప్రజలకు అందజేశారన్నారు. అన్ని ప్రాంతాలను సమానంగా అభివృద్ధి చేస్తున్నారన్నారు. బాలచెరువు సచివాలయం పరిధిలో సంక్షేమానికి రూ.16 కోట్లు ఖర్చు చేశారన్నారు. రాష్ట్రంలో మరింత సంక్షేమం, అభివృద్ధి, అవినీతి లేని పాలన కోసం జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా మరోసారి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో 73వ వార్డు కార్పొరేటర్ భూపతిరాజు సుజాత, క్లస్టర్ అధ్యక్షులు ఎస్‌ఎండి గౌస్, రాజాన వెంకటరావు, నాయకులు రెడ్డి జగన్నాథం, పెదిరెడ్ల ఈశ్వరరావు, పేరం రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్య శ్రీనివాస మందిరంలో కాత్యాయినీ వ్రతాలు



కాత్యాయినీ వ్రతాల్లో పాల్గొన్న యువతులు

అక్కిరెడ్డిపాలెం: జీవీఎంసీ 69వ వార్డు తుంగ్లాంలోని శ్రీ సత్య శ్రీనివాస మందిరంలో సామూహిక కాత్యాయినీ వ్రతాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మంగళవారం భెల్ సమితి సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో విశాఖ జిల్లా మహిళా విభాగం సహకారంతో జరిగిన కార్యక్రమంలో 200 మంది అవివాహిత యువతులు పాల్గొన్నారు. కార్పొరేటర్ కాకి గోవింద రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వ్రతాలను ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా భక్తులు వ్రతాల్లో పాల్గొన్నట్లు సత్యసాయి సేవా సంస్థల జిల్లా అధ్యక్షుడు పి.ఆర్.ఎస్.ఎన్.నాయుడు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా మహిళా ఆధ్యాత్మిక కో–ఆర్డినేటర్ రాధ, జిల్లా మహిళా సేవాదళ్ కో– ఆర్డినేటర్ ఈశ్వరి, జిల్లా మహిళా యువత సమన్వయకర్త సాయి కుమారి, భెల్ కమిటీ కన్వీనర్ సుంకర రమేష్, తుంగ్లాం గ్రామ సాయి భక్తులు నందీశ్వరరావు, కొల్లి వెంకటరావు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

కోనేరు అభివృద్ధి పనుల పరిశీలన



లంకెలపాలెం కోనేరు అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

అగనంపూడి: ప్రజలకు ఆరోగ్యం అందించడంతో పాటు జలాల సంరక్షణకు చెరువులు, కోనేరులను అభివృద్ధి చేస్తున్నామని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ అన్నారు. అమృత్ పథకంలో భాగంగా 79వ వార్డు లంకెలపాలెం జాతీయ రహదారిని ఆనుకొని ఉన్న కోనేరు అభివృద్ధి పనుల పురోగతిని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం, ఆహ్లాదం కోసం అర్బన్ గ్రీనరీ, బ్యూటిఫికేషన్ విభాగం ఆధ్వర్యంలో పనులు చేపట్టామని చెప్పారు. పనులు మందకొడిగా సాగడంతో అధికారులు, కాంట్రాక్టర్‌ను అడిగి కారణాలు తెలుసుకున్నారు. త్వరితగతిన నిర్మాణ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.కోటి ఇరవై లక్షలతో పనులు ప్రారంభించామన్నారు. వాకింగ్ ట్రాక్, రక్షణ గోడ, పిల్లలు ఆడుకోడానికి వీలుగా పార్కు నిర్మిస్తున్నట్లు చెప్పారు. అనంతరం వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు కమిషనర్‌కు వార్డు సమస్యలు వివరించారు. కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ పొందూరు సింహాచలం, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవి, ఏసీపీ రామలింగేశ్వరరెడ్డి, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్, టీపీవో రేవతి పాల్గొన్నారు.

యువ రచయితకు సత్కారం



యువకవి వెంకట్‌ను సత్కరిస్తున్న కార్పొరేటర్ వరలక్ష్మి, ప్రజా సంఘాల ప్రతినిధులు

అగనంపూడి: వాస్తవ సంఘటనల ఆధారంగా రచనలు చేస్తున్న వెంకట్ కంచిపాటికి ఉజ్వల భవిష్యత్తు ఉందని 85వ వార్డు కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మి అన్నారు. అగనంపూడిలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొండయ్యవలసకు చెందిన కంచిపాటి వెంకట నరసింహమూర్తి రచించిన 'అతన్ని అలా వదిలేయకండి..' కవితా సంపుటిని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక స్పృహ కలిగేలా మూర్తి రచనలు ఉండడం, ఈ ప్రాంతానికి మంచి పేరు రావడం సంతోషంగా ఉందన్నారు. కవితా సంపుటి రచయిత నరసింహమూర్తి మాట్లాడుతూ సమాజ నడవడిక, తీరు ఆధారంగా తాను వెంకట్ కంచిపాటి కలం పేరుతో రచనలు సాగిస్తున్నానన్నారు. అనంతరం వెంకట్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉక్కు ఏజీఎం పి.వి.అప్పారావు, రచయిత చెల్లూరు సాంబమూర్తి, ప్రజా సంఘాల నాయకులు కొప్పుశెట్టి సూర్యనారాయణ, పట్టా రామ అప్పారావు, సాయిన సన్యాసిరావు, బలిరెడ్డి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కునగరం క్లబ్‌లో వస్త్ర ప్రదర్శన ప్రారంభం



ఉక్కుక్లబ్‌లో ప్రదర్శన తిలకిస్తున్న ఉక్కునగరవాసులు

ఉక్కునగరం: ఉక్కు అధికారుల మానసిక ఉల్లాస కేంద్రం ఉక్కునగరం క్లబ్ వస్త్ర ప్రదర్శన మంగళవారం ప్రారంభమైంది. సంక్రాంతి సందర్భంగా దేశంలోని వివిధ ప్రముఖ సంస్థల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ప్రదర్శనను క్లబ్ కార్యదర్శి రవి రంజన్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ పండగ సందర్భంగా ఉక్కునగరవాసులు ఇతర షాపులపై ఆధారపడకుండా క్లబ్‌లో ఈ ప్రదర్శన ఏర్పాటు చేశారన్నారు. స్థానికులు ప్రదర్శనను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. నిర్వాహకులు కుందన్ మాట్లాడుతూ జనవరి 18 వరకు నిర్వహించనున్న ప్రదర్శనలో రేమండ్స్, పార్క్ ఎవెన్యూ, కలర్ ప్లస్ వంటి ప్రముఖ బ్రాండ్లకు చెందిన వస్త్రాలు అందుబాటులో ఉంచామన్నారు. పురుషులకు షర్టులు, ప్యాంటులు, జీన్స్, టీ షర్టులు, షార్టులు, పార్టీవేర్ షర్టులు ఉంటాయన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు తీవ్ర గాయాలు

అక్కిరెడ్డిపాలెం: ఆస్పత్రిలో చికిత్స పొంది, కొడుకుతో బైక్‌పై ఇంటికి వెళ్తున్న మహిళ రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైంది. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కంచరపాలేనికి చెందిన మందల చెన్నమ్మలు (42) తన కొడుకుతో అగనంపూడి ఏరియా ఆస్పత్రికి చికిత్స కోసం వెళ్లారు. చికిత్స చేయించుకుని, తిరిగి కంచరపాలెం వెళ్తుండగా జాతీయ రహదారిపై నాతయ్యపాలెం వద్దకు వచ్చేసరికి బైక్‌ను వెనుక నుంచి కారు ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై కూర్చున్న చెన్నమ్మలు తీవ్ర గాయాలపాలైంది. వెంటనే ఆమెను షీలానగర్‌లోని కిమ్స్ ఐకాన్‌కు చికిత్స నిమిత్తం తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం కేజీహెచ్‌కు తరలించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గాజువాక పోలీసులు వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టనున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి క్రీడాపోటీల్లో ప్రతిభ



రామతేజను అభినందిస్తున్న కళాశాల చైర్మన్ బలరామకృష్ణ

గాజువాక: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఇటీవల నిర్వహించిన రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో స్థానిక శ్రీకృష్ణా జూనియర్ కళాశాల విద్యార్థి సియ్యాద్రి రామతేజ ప్రతిభ కనబరిచాడు. అండర్ 19 కేటగిరీ బాలుర విభాగంలో 400 మీటర్లు, 800 మీటర్ల రన్నింగ్ పోటీల్లో రెండు బంగారు పతకాలతో పాటు 400 మీటర్ల రిలే విభాగంలో రజత పతకాన్ని సాధించి జాతీయ పోటీలకు ఎంపికయ్యాడు. ఈ సందర్భంగా మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కళాశాల చైర్మన్ బలరామకృష్ణ, ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్‌రావు తదితరులు విద్యార్థిని, కోచ్ బ్రహ్మాజీని అభినందించారు.

ప్రభుత్వరంగ సంస్థలతోనే దేశాభివృద్ధి



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్వాతంత్య్రం అనంతరం ప్రభుత్వ రంగ పరిశ్రమలతోనే దేశం అభివృద్ధి చెందిందని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు అన్నారు. లక్షలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పిస్తున్న సంస్థను ప్రైవేటీకరించాలనుకోవడం కార్మికులకు అన్యాయం చేయడమేనని పేర్కొన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1041వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు, నిర్వాసితులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమాన్ని ప్రజా పోరాటంగా మలచి పాలకులు స్పందించే విధంగా కార్మికులు పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్యపరీక్షలు



విద్యార్థులకు వైద్యపరీక్షలు చేస్తున్న వైద్యులు

పెదగంట్యాడ: జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. లయన్స్ క్లబ్, మొహసిన్ స్కూల్ హెల్త్ ఐ కేర్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో మొత్తం 742 మంది విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. అందులో 42 మంది విద్యార్థులకు కళ్లద్దాలు అవసరమని, 7గురు విద్యార్థులకు కలర్ బ్లైండ్‌నెస్ ఉన్నట్టు గుర్తించారు. అనంతరం కళ్ల సమస్యలతో బాధపడుతున్న వారికి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం జి.ప్రమీల, జగన్నాథరావు, రాము, అఫ్రీన్, ఆనందరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ సాబ్జీకి నివాళి



సాబ్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న యూటీఎఫ్ నాయకులు

అగనంపూడి: పీడీఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అకాల మరణం ఉపాధ్యాయ వర్గానికి తీరని లోటని యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు ఎస్.సుబ్బారావు అన్నారు. స్థానిక పార్కులో నిర్వహించిన సంతాప సభలో సాబ్జీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయ వర్గం మంచి ఆప్తుడిని కోల్పోయిందన్నారు. కార్యక్రమంలో పరవాడ మండల కమిటీ నాయకులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో సొత్తు రికవరీ

అక్కిరెడ్డిపాలెం: గాజువాక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన దొంగతనం కేసులో నిందితులను క్రైం పోలీసులు అరెస్ట్ చేసి, చోరీ సొత్తు రికవరీ చేశారు. గాజువాక క్రైం పోలీసులు తెలిపిన వివరాలివి.. గాజువాక కణితి రోడ్డు కై లాష్‌నగర్‌లో కదలి తాతారావు ఇంట్లో సోమవారం గుర్తు తెలియని వ్యక్తులు చొరబడ్డారు. బీరువాలోని 4 గ్రాముల బంగారు ఉంగరం అపహరించుకుపోయారు. దీనిపై తాతారావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దర్యాప్తు చేపట్టిన గాజువాక క్రైం పోలీసులు పెదగంట్యాడ, ప్రియదర్శిని కాలనీకి చెందిన ఇరోతి చలపతిరావును అరెస్ట్ చేశారు. బంగారు ఉంగరంతో పాటు 6 డొమెస్టిక్ గ్యాస్ సిలెండర్లు స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై న్యూపోర్టు పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్ ఉందని, గతంలో అతనిపై 6 కేసులు నమోదయ్యాయని చెప్పారు.

న్యూపోర్టు పోలీస్ స్టేషన్ పరిధిలో..

గంగవరం గ్రామం వద్ద హెచ్‌పీసీఎల్ ప్రాజెక్ట్ వర్క్‌ను ఎల్ అండ్ టీ సంస్థ చేపట్టింది. ఈ క్రమంలో లేబర్ క్యాంప్ వద్ద 500 కేబుల్ డ్రమ్స్ ఉంచగా, అందులో రెండు కేబుల్ డ్రమ్స్ ఈ నెల 4న అర్ధరాత్రి సమయంలో చోరీకి గురయ్యాయని ఎల్ అండ్ టీ ఐఆర్ ఉద్యోగి పుష్పరాజ్ రానే న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తు చేపట్టిన క్రైం సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్ఐలు పెదగంట్యాడ గిరిజన కాలనీ శివాలయం వద్ద నివాసం ఉంటున్న వాడపల్లి నిర్మల, వాడపల్లి కనక, వాడపల్లి పావని, పులి లక్ష్మి, పెండ్ర చిన్నమ్మలు, పెండ్ర అప్పమ్మలను అరెస్ట్ చేసి వారి నుంచి చోరీ సొత్తు రికవరీ చేశారు. దర్యాప్తులో ప్రతిభ కనబరిచిన అధికారులను, సిబ్బందిని విశాఖపట్నం డీసీపీ జోన్–1 లా అండ్ ఆర్డర్ కె.శ్రీనివాసరావు, క్రైం ఏడీసీపీ డి.గంగాధరం అభినందించారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల వినతి

అగనంపూడి: విద్యాశాఖ, ఎస్ఎస్ఏల్లో ఔట్‌సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు పరిష్కరించాలని యూటీఎఫ్ గౌరవాధ్యక్షుడు నెల్లి సుబ్బారావు కోరారు. అగనంపూడి నిర్వాసిత కాలనీలో సుబ్బారావును కలిసిన ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆయనకు వినతిపత్రం సమర్పించారు. తమకు యూటీఎఫ్ అండగా ఉండాలని కోరారు. ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు తమ యూనియన్ సంఘీభావం తెలుపుతున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల నాయకులు శ్రీనివాసరావు, బాలరాజు, ఎండీ ఆలీ, శాంతి, నిర్మల తదితరులు పాల్గొన్నారు.